ఇంకెన్నాళ్లీ అద్దె అవస్థలు!

- దశాబ్దాలుగా సొంత భవనం లేక ఇబ్బందులు
- వర్షం వస్తే స్టేషన్‌లోకి మురుగు నీరు
- ప్రధానమైన కేటీరోడ్డుపైనే స్టేషన్
- పార్కింగ్ సమస్యతో సతమతం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): దాదాపు అర్ధ శతాబ్దం దాటుతున్నా కొత్తపేట పోలీస్ స్టేషన్ సొంత భవనం కల నెరవేరడం లేదు.. 1980వ దశకంలో వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కొత్తపేట సబ్‌స్టేషన్‌గా ఉండేది. ఆ సమయంలో ఒక ఎస్‌ఐ కొత్తపేట పోలీస్ స్టేషన్ బాధ్యతలు నిర్వర్తించే వారు. రాను రాను చిట్టినగర్, పాలప్రాజెక్టు, కంసాలిపేట, పాతరాజరాజేశ్వరిపేట ప్రాంతాల వైపు జనాభా పెరగడం, శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా 1990లో కొత్తపేట పోలీస్‌స్టేషన్ ఏర్పడింది. కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని వన్‌టౌన్ హిందూ హైస్కూల్ నుంచి విజయవాడ రూరల్ గ్రామాలను తీసుకువచ్చారు. దీంతో కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలలో విస్తరించింది. ఇంతటి ప్రాధాన్యం ఉన్న కొత్తపేట పోలీస్ స్టేషన్‌కు దశాబ్దాలుగా సొంత భవనం సమకూరడం లేదు. ఐదేళ్ల కిందట పాలప్రాజెక్టు క్వార్టర్స్ సమీపంలోని కొంత స్థలాన్ని కొత్తపేట పోలీస్‌స్టేషన్ నిర్మాణం కోసం కేటాయింపులు జరిగినా పునాదులు దాటలేదు. 50 ఏళ్లుగా కొత్తపేట పోలీస్ స్టేషన్ ఇరుకు గదుల్లో, ప్రధాన రోడ్డుపై పోలీసు సిబ్బంది తన వాహనాలను నిలుపుకోవాల్సిన దుస్థితి.. ప్రస్తుతం సీఐ పర్యవేక్షణలో రూరల్ సెక్టార్, క్రైంతో పాటు మూడు సెక్టార్లలో ఎస్‌ఐలు విధులు నిర్వర్తిస్తున్నారు. స్టేషన్‌లో విధులు పెరుగుతున్నా.. పోలీస్ స్టేషన్ పరిస్థితి ఇప్పట్లో మారేలా లేదని పోలీసు సిబ్బంది వాపోతున్నారు.

పునాదులు దాటని కొత్తపేట పోలీస్ స్టేషన్ భవనం నిర్మాణం



ప్రస్తుత కొత్తపేట పోలీస్ స్టేషన్ ఇది

వర్షం వస్తే మునిగిపోతుంది..

కొత్తపేట పోలీస్ స్టేషన్ కేటీరోడ్డుపై ఉండటంతో చిన్న పాటి వర్షం వచ్చినా మురుగు, వర్షం నీరు స్టేషన్‌లోకి చేరుతోంది. గత ఏడాది సెప్టెంబర్ 1వ తేదీన కురిసిన భారీ వర్షానికి స్టేషన్‌లో రెండు అడుగుల మేర వర్షం నీరు రెండు రోజుల పాటు నిలిచిపోయింది. దీంతో స్టేషన్‌లోని పలు కేసులకు సంబంధించిన కీలక పత్రాలు, కంప్యూటర్లు, ఇతర సామగ్రిని టేబుల్స్‌పైకి ఎక్కించారు. అంతే కాకుండా కేటీ రోడ్డు ఎత్తు పెంచడం కూడా పోలీస్ స్టేషన్‌కు శాపంగా మారింది.


పునాది వద్దే ఆగిన కొత్తపేట పోలీస్ స్టేషన్ భవనం

పార్కింగ్ పెద్ద సమస్యే..

పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించే సీఐ దగ్గర నుంచి హోంగార్డుల వరకు తమ వాహనాలను పార్కింగ్ చేసుకోవాలంటే కేటీ రోడ్డే దిక్కు. మరో వైపున స్టేషన్‌కు ఉన్న రక్షక్ వాహనాలతో పాటు సీఐ వాహనాన్ని సైతం కేటీరోడ్డుపైనే నిలుపుతారు. దసరా, భవానీ దీక్ష విరమణల సమయంలో కేటీరోడ్డు మీదగా ట్రాఫిక్‌ను మళ్లించే క్రమంలో పోలీస్ స్టేషన్ వద్ద వాహనాల పరిస్థితి వర్ణనాతీతం. అంతే కాకుండా వివిధ కేసులలో పట్టుకున్న ఆటోలు, మినీ లారీలను స్టేషన్ ఎదుటే నిలిపేవారు. అయితే కొంత కాలంగా పాల ప్రాజెక్టు ఆవరణలోని క్వార్టర్స్ గ్రౌండ్‌లో నిలుపుతున్నారు.

నెరవేరేది ఎప్పుడో?

పాలప్రాజెక్టు ఆవరణలో కొత్తపేట పోలీస్ స్టేషన్ భవన నిర్మాణం జరుగుతుందంటే స్టేషన్ సిబ్బంది ఇబ్బందులు తీరుతాయని అందరూ భావించారు. నూతన భవనంలో సీఐతో పాటు ఎస్‌ఐలకు వేరు వేరు గదులు, స్టేషనరీకి, సిబ్బందికి వేరువేరు అంతస్తుల నిర్మాణంతో పాటు గ్రౌండ్ ఫ్లోర్‌లో చక్కటి పార్కింగ్ సదుపాయం దొరుకుతుందని భావించారు. అయితే ఇంత వరకు నూతన పోలీస్ స్టేషన్ భవన నిర్మాణం పునాదులు దాటకపోవడంతో పోలీసు సిబ్బంది ఇబ్బందులు యథావిధిగా కొనసాగుతూనే ఉన్నాయి.

క్లుప్తంగా

నిరాశ్రయులను ఆదుకోవాలి

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఆపదలో ఉన్న వారితో పాటు అనాథలు, నిరాశ్రయులను ఆదుకునేలా ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాలను చేపట్టాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. హెల్ప్ ది హోప్ లెస్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం చిట్టినగర్ సొరంగం రోడ్డులో పేదలకు అన్నదానం, వస్త్రదాన కార్యక్రమాలను నిర్వహించారు. సేవా సంస్థ అధ్యక్షుడు ఈదులూరి రాధాకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్సీ జెల్లి విల్సన్, బీజేపీ నాయకులు అడ్డూరి శ్రీరామ్, కార్పొరేటర్ ఉమ్మడి చంటి, బీసీ నాయకులు నమ్మి అప్పారావులు విచ్చేసి అన్నదానాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో అన్నపూర్ణ, శ్రీవరణ్, శ్రీఛాయ తదితరులు పాల్గొన్నారు.

21మందికి ఉద్యోగాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ప్రముఖ గ్లోబల్ ప్రొఫెషనల్ సర్వీసెస్ కంపెనీ నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో తమ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరచి ఉద్యోగాలకు ఎంపికయ్యారని కేబీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి. కృష్ణవేణి చెప్పారు. తమ కళాశాలలో డిగ్రీ మూడో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు మొత్తం 21 మంది రూ.3.44 లక్షల వార్షిక ప్యాకేజీతో ఎంపికయ్యారన్నారు. మారుతున్న సాంకేతిక విజ్ఞానం, కమ్యూనికేషన్ నైపుణ్యాలలో తమ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడం ద్వారా విద్యార్థులకు ప్రాంగణ ఎంపికల్లో నిర్వహించే ఇంటర్వ్యూల్లో మంచి మార్కులు సాధించినట్లు ప్లేస్‌మెంట్ అధికారి శ్రీనివాసరెడ్డి చెప్పారు. సోమవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో హిందూహై స్కూల్స్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి డాక్టర్ వి. నారాయణరావు, వైస్ ప్రిన్సిపాల్స్ పీఎల్ రమేష్, డాక్టర్ ఎం. వేంకటేశ్వరరావు, డాక్టర్ కె. రామకృష్ణ ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను అభినందించి, సత్కరించారు.

సత్వరమే విచారణ



విజయవాడస్పోర్ట్స్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా పోలీస్ కమిషనరేట్‌కు వచ్చే ఫిర్యాదులపై సత్వరమే విచారణ చేపట్టాలని జిల్లాలోని పోలీస్ స్టేషన్‌ల అధికారులను డెప్యూటీ పోలీస్ కమిషనర్ ఎ.బి.టి.ఎస్.ఉదయ రాణి ఆదేశించారు. కమిషనరేట్ కార్యాలయంలో సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో 92 మంది నుంచి డీసీపీ ఫిర్యాదులను స్వీకరించారు. నగదు లావాదేవీలపై 21, కుటుంబ కలహాలపై ఎనిమిది, మహిళా సంబంధిత నేరాలపై ఎనిమిది, ఆస్తి వివాదాలపై 18, మోసాలపై ఏడు, దొంగతనాలపై 11, వివాదాలపై 19 మంది ఫిర్యాదులిచ్చినట్లు ఆమె తెలిపారు. ఫిర్యాదుదారులతో మాట్లాడిన అనంతరం ఫిర్యాదులపై విచారణ జరిపి పరిష్కరించాలని ఆయా స్టేషన్‌ల అధికారులను ఆదేశించారు.

విద్యుత్ చార్జీలను తగ్గించండి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను తక్షణం రద్దు చేయాలని సీపీఎం పశ్చిమ నగర కమిటీ కార్యదర్శి బోయి సత్యబాబు డిమాండ్ చేశారు. విద్యుత్ చార్జీల భారాలను రద్దు చేయాలని కోరుతూ సీపీఎం పశ్చిమ నగర కమిటీ ఆధ్వర్యంలో స్థానిక నెహ్రూ బొమ్మ సెంటర్‌లో నిరసన కార్యక్రమాన్ని సోమవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు చార్జీలను పెంచమని, పెరిగిన భారాలను తగ్గిస్తామని హామీ ఇచ్చారన్నారు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత భారాలను మోపటమే పనిగా పెట్టుకున్నారన్నారు. అంతేకాకుండా ఇచ్చిన సూపర్‌సిక్స్ వంటి వాగ్దానాలను తుంగలో తొక్కుతున్నారని చెప్పారు. వివిధ చార్జీల పేరుతో రాష్ట్ర ప్రజలపై రూ.17 వేల కోట్ల భారం మోపటం అన్యాయమన్నారు. నాయకులు కె. సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

మరింత విస్తృతంగా సేవ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సేవా సంస్థలు తమ సేవా కార్యక్రమాలను విస్తృతం చేసినప్పుడే సమాజానికి చేరువవుతారని వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షుడు వేముల హజరత్తయ్యగుప్తా అన్నారు. వాసవి క్లబ్ విజయవాడ పెరల్స్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం సోమవారం సాయంత్రం పాతబస్తీలోని ఒక కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వేముల హజరత్తయ్యగుప్తా మాట్లాడుతూ క్లబ్ నిర్వాహకులు సమాజంలోని పేదలకు విద్య, వైద్య రంగాలకు చెందిన సేవలను అందించాలని సూచించారు. అనంతరం అధ్యక్షురాలిగా బిందుమాధవి, కార్యదర్శిగా భవానీ, కోశాధికారిగా శ్రీప్రియలతో క్లబ్ గవర్నర్ అన్నం సాయి సునీతతో ప్రమాణ స్వీకారం చేయించారు. సభలో క్లబ్ సభ్యులు ఆదిశేషు, పీవీడీ ప్రసాద్, హరిప్రసాద్, సూర్యప్రకాశ్, కేశవ, రాఘవ, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ల ప్రమాణ స్వీకారం

భవానీపురం(విజయవాడపశ్చిమ): కళింగ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్లుగా నియమితులైన 15 మందితో చైర్మన్ రోణంకి కృష్ణ నాయుడు ప్రమాణ స్వీకారం చేయించారు. గొల్లపూడిలోని బీసీ సంక్షేమ భవన్‌లో సోమవారం కృష్ణ నాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ వెనుకబడిన కళింగ సామాజికవర్గం అభ్యున్నతికి తమ వంతు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నిమ్రా విద్యా సంస్థల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ తమ్మినేని నారాయణ మూర్తి, శ్రీకాకుళం జిల్లా బీజేపీ అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వరరావు, కూన పాల్గుణ రావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి



లబ్బీపేట(విజయవాడతూర్పు): వాణిజ్య పన్నుల శాఖలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని ఆ శాఖ ఉద్యోగుల సంఘ నేతలు నోడల్ డివిజన్ జాయింట్ కమిషనర్ ఎస్. ప్రశాంత్ కుమార్‌ను కోరారు. నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం ఆయన చాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిసిన నేతలు ఉద్యోగులకు సంబంధించి పలు అంశాలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలపై సానుకూలంగా స్పందించడంతో పాటు, ఉద్యోగులందరూ కష్టపడి పని చేయాలని, తప్పకుండా సమస్యలు పరిష్కరిస్తానని ప్రశాంత్‌కుమార్ హామీ ఇచ్చారు. జేసీని కలిసిన వారిలో వాణిజ్య పన్నులశాఖ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వట్టిపల్లి రామస్వామి, గౌరవాధ్యక్షుడు ఎం.వెంకటేశ్వరరావు, జనరల్ సెక్రటరీ ఈ. మోహన్‌దాస్, కోశాధికారి సీహెచ్ సువర్ణరాజు, ఎన్టీఆర్, కృష్ణాజిల్లా ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ ప్రెసిడెంట్ పరసా విద్యాసాగర్ తదితరులు ఉన్నారు.

అలరించిన వీణాగానం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో హైదరాబాద్‌లోని శ్రీతుంబర సంగీతాలయానికి చెందిన దుర్గా మైత్రేయి బృందం వీణాగానాన్ని ప్రదర్శించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై దుర్గామైత్రేయి, అలివేణి, రేఖ, వాణి, అరుణ, రేణుక, వీణ, పద్మావతిలు పలు కీర్తనలకు వీణపై పలికించారు. అనంతరం కళాకారుల బృందానికి అమ్మవారి దర్శనం కల్పించిన ఆలయ అధికారులు ప్రసాదాలను అందజేశారు.

నూతన వత్సర శుభాకాంక్షలు



మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జిల్లాకు చెందిన నాయకులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం తాడేపల్లిలోని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛం అందించారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్, పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, మేయర్ రాయన భాగ్యలక్ష్మి తదితరులు ఉన్నారు.

– వన్‌టౌన్(విజయవాడపశ్చిమ)

నిర్ణీత గడువు లోగా సమస్యలను పరిష్కరించాలి

వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చిన ప్రతి ఫిర్యాదును నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. ప్రధాన కార్యాలయంలో గల కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సోమవారం ఉదయం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో స్వీకరించిన ప్రతి ఫిర్యాదును అధికారులందరూ నిర్ధారించిన గడువులోపు సంపూర్ణ పరిష్కారం చూపాలన్నారు. సమస్యలు పునరావృతం కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పట్టణ ప్రణాళిక విభాగం–5, రెవెన్యూ–3, ఎస్టేట్–1, అడ్మినిస్ట్రేషన్–1 ఫిర్యాదులు ఆయన స్వీకరించారు. అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) డాక్టర్ డి. చంద్రశేఖర్, డెప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి. సృజన, చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్, చీఫ్ ఇంజినీర్ ఆర్. శ్రీనాథ్, సూపరింటెండింగ్ ఇంజినీర్స్ పి. సత్యకుమారి, స్విచ్ సత్యనారాయణ, ఇన్‌చార్జ్ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, జాయింట్ డైరెక్టర్ అమృత్, ఎస్టేట్ ఆఫీసర్ ఇన్‌చార్జ్ డాక్టర్ లత, డెప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ రామ్మోహన్, ఆర్ఎఫ్ఓ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న వలంటీర్లు

వలంటీర్ల వినతిపత్రం..

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గత ఏడాది జూన్ నుంచి డిసెంబర్ వరకు పెండింగ్‌లో ఉన్న తమ వేతనాలు చెల్లించాలని వలంటీర్లు కమిషనర్‌ను కోరారు. ఈ మేరకు వలంటీర్ల అసోసియేషన్ ప్రతినిధి లంక గోవిందరాజులు ఆధ్వర్యంలో నగరంలోని వివిధ ప్రాంతాల్లో విధులు నిర్వహించిన పలువురు వలంటీర్లు కమిషనర్‌ను కలిసి వినతిపత్రం అందించారు.

కాంట్రాక్ట్ కార్మికులకు ప్రాధాన్యం ఇవ్వండి

భవానీపురం(విజయవాడపశ్చిమ): నగరపాలక సంస్థ పారిశుద్ధ్య కార్మికుల ఖాళీ పోస్టుల నియామకంలో ఇప్పటికే పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు ప్రాధాన్యం కల్పించాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి బుద్దె రాజా, మినిస్టీరియల్ ఆల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు దారా రాంబాబు కోరారు. మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ధ్యానచంద్రను సోమవారం వారు కలిసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. కోవిడ్, దసరా, భవానీ దీక్షలు, స్వచ్ఛ సర్వేక్షణ్, సిల్ట్ తొలగింపు వంటి అత్యవసర పనులు, అదే విధంగా బుడమేరు వరద సమయంలో కాంట్రాక్ట్ కార్మికులుగా సుమారు 60 మంది వరకు పని చేశారని గుర్తు చేశారు. యూనియన్ గౌరవాధ్యక్షుడు జక్కీ జేమ్స్, నాయకులు పాల్గొన్నారు.


యూనియన్ నాయకులతో మాట్లాడుతున్న కమిషనర్ ధ్యానచంద్ర

ఆర్‌పీఎఫ్ కుటుంబాలకు 'డ్రై క్యాంటీన్'

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): ఆర్‌పీఎఫ్‌లో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది, రిటైర్డ్ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు సేవలు అందించేందుకు కేంద్ర హోం మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్‌లోని డీఆర్‌ఎం కార్యాలయ ప్రాంగణంలో 'కేంద్రీయ పోలీస్ కల్యాణ్ భండార్ (డ్రై క్యాంటీన్)'ను ఏర్పాటు చేశారు. సోమవారం విజయవాడ రైల్వే డీఆర్‌ఎం నరేంద్ర ఏ పాటిల్ చేతుల మీదుగా రిబ్బన్ కట్ చేసి డ్రై క్యాంటీన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఎం మాట్లాడుతూ ఆర్‌పీఎఫ్ సిబ్బందికి రాయితీపై నిత్యావసరాలు, తినుబండారాల నుంచి లైఫ్ స్టైల్ ఉత్పత్తులు, యూనిఫారంలు, ఎలక్ట్రానిక్స్ ఉపకరణాలు, ద్విచక్ర వాహనాలు, నాలుగు చక్రాల వాహనాలను రాయితీతో అందజేస్తామని తెలిపారు. కేపీకేబీ కార్డును ఉపయోగించుకుని ఆర్‌పీఎఫ్ సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వాహనాలు ప్రారంభం..

ఇదే కార్యక్రమంలో విజయవాడ డివిజన్ ఆర్‌పీఎఫ్ సిబ్బంది కోసం రైల్వేబోర్డు రూ. 38 లక్షలతో నూతనంగా కొనుగోలు చేసిన ఒక బస్సు, ఎనిమిది బుల్లెట్ వాహనాలను కూడా డీఆర్‌ఎం జెండా ఊపి ప్రారంభించారు. అవాంఛనీయ ఘటనలు జరిగినప్పుడు సిబ్బంది వేగంగా ఘటనా స్థలానికి చేరుకోవడానికి ఈ వాహనాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఏడీఆర్‌ఎంలు పి.ఈ ఎడ్విన్, కొండా శ్రీనివాసరావు, సీనియర్ డీఎస్‌సీ వల్లేశ్వర బాబుజీ తోకల, ఏడీఎస్‌సీ, జి.మధుసూదనరావు, పలువురు ఇన్‌స్పెక్టర్‌లు పాల్గొన్నారు.


ఆర్‌పీఎఫ్ వాహనాలకు జెండా ఊపి ప్రారంభిస్తున్న డీఆర్‌ఎం నరేంద్ర ఏ పాటిల్

శిష్టకరణాల నూతన జిల్లా కమిటీ ఎన్నిక

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): శిష్టకరణాల ఎన్టీఆర్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక సోమవారం కేఎల్ రావునగర్‌లో సోమవారం జరిగింది. సమావేశానికి రాష్ట్ర సంఘ ప్రచార కార్యదర్శి సదాశివుని లక్ష్మణరావు విచ్చేసి నూతన కమిటీ ఎన్నిక ప్రక్రియను నిర్వహించారు. జిల్లా కమిటీ గౌరవాధ్యక్షుడిగా వినం సుబ్బారావు, అధ్యక్షుడిగా బలివాడ శివకుమార్ పట్నాయక్, ప్రధాన కార్యదర్శిగా కాగాపు విజయ్‌కుమార్, కోశాధికారిగా పట్నాయక్ ఉమామహేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా బలివాడ నరేంద్ర బాబు, బలివాడ మల్లేశ్వరవరావు, అల్లిన చక్రధర్, నందివాడ గోపి, నిర్వాహక కార్యదర్శిగా కొంపల్లి సంతోషిని, కార్యదర్శులుగా శేఖర్, బెవర కృష్ణవేణి, యూత్ అధ్యక్షులుగా కంటిమంత్రి శివకుమార్ పట్నాయక్‌లతో పాటు 12 మంది కార్యవర్గ సభ్యులను, అడ్వైజరీ కమిటీ చైర్మన్‌గా శేఖర్ మహంతి హేమసుందర్‌తో పాటు 12 మంది సభ్యులను ఎన్నుకున్నారు.

మెరుగైన వనరులు సమకూర్చడం శాప్ బాధ్యత

శాప్ చైర్మన్ రవినాయుడు

విజయవాడస్పోర్ట్స్: క్రీడాకారులకు మెరుగైన వనరులు సమకూర్చడంతో పాటు సరైన వసతులు కల్పించడం ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) బాధ్యత అని శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు స్పష్టం చేశారు. శాప్ కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో అధికారులతో సోమవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రవినాయుడు మాట్లాడుతూ రాష్ట్రాన్ని క్రీడాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందన్నారు. జాతీయ, అంతర్జాతీయ క్రీడా వేదికలపై సత్తా చాటేలా మన రాష్ట్ర క్రీడాకారులను తయారు చేయాల్సిన బాధ్యత మనపై ఉందని గుర్తు చేశారు. క్రీడాకారులు భవిష్యత్తే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని చెప్పారు. సమన్వయం చేసుకుని సమష్టి కృషితో క్రీడాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా శాప్ ఆధ్వర్యంలో జరుగుతున్న క్రీడాభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, శాప్, ఖేలో ఇండియా, కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపడుతున్న మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియాలు, క్రీడావికాస కేంద్రాలు, స్పోర్ట్స్ ఎరీనాల నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థల పనితీరును ఎప్పటికప్పుడు సమీక్షిస్తుండాలని సూచించారు.


సమావేశంలో మాట్లాడుతున్న శాప్ చైర్మన్ రవినాయుడు

అట్టహాసంగా ఆరంభం


జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి కందుల దుర్గేష్ తదితరులు

విజయవాడలో ఎస్‌జీఎఫ్‌ఐ జాతీయ వాలీబాల్ టోర్నీ ప్రారంభం

విజయవాడస్పోర్ట్స్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్‌జీఎఫ్‌ఐ) జాతీయ వాలీబాల్ బాలికల పోటీల నిర్వహణతో విజయవాడకు క్రీడా పండుగ వాతావరణం వచ్చిందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. నగరంలోని పీబీ సిద్ధార్థ కాలేజీ మైదానంలో ఎస్‌జీఎఫ్ అండర్–19 వాలీబాల్ జాతీయ పోటీలు సోమవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌తో కలిసి మంత్రి దుర్గేష్ ఈ పోటీలను సోమవారం సాయంత్రం జ్యోతి ప్రజ్వలన చేసి లాంఛనంగా ప్రారంభించారు. స్కూల్ గేమ్స్ రాష్ట్ర కార్యదర్శి జి. భానుమూర్తిరాజు మాట్లాడుతూ ఐదు రోజుల పాటు జరిగే ఈ టోర్నీలో దాదాపు 25 రాష్ట్ర జట్లు పాల్గొంటున్నాయన్నారు. ఫ్లడ్ లైట్ల వెలుగులో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన కోర్టుల్లో లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు నిర్వహిస్తున్నామని చెప్పారు. 26 రాష్ట్రాల నుంచి వచ్చిన 400 మంది క్రీడాకారులకు, 70 మంది కోచ్, మేనేజర్లకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. సిద్ధార్థ మహిళా కాలేజీ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక నృత్యం చూపరులను ఆకట్టుకుంది. ఎస్‌జీఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.వి.రాధాకృష్ణ, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఫీల్డ్ అబ్జర్వర్ ప్రదీప్ యాదవ్, స్కూల్ గేమ్స్ కృష్ణా జిల్లా అండర్ –19 కార్యదర్శి, పోటీల కార్యనిర్వాహక కార్యదర్శి వి.రవికాంత, కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి, సిద్ధార్థ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్.వెంకటేశ్వర్లు, కృష్ణా జిల్లా వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి దోనేపూడి దయాకర్, ఏపీ బ్యాడ్మింటన్ సంఘం కార్యదర్శి పి.అంకమ్మచౌదరి, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పాల్గొన్నారు.

ఆలోచనల్లో వైవిధ్యం.. ఆవిష్కరణలు అద్భుతం




విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టుకు మార్కులు వేస్తున్న జడ్జిలు

కొత్త ఆలోచనలు.. కొంగొత్త ఆవిష్కరణలతో విద్యార్థులు సత్తా చాటారు. తమ నైపుణ్యానికి సృజనాత్మకతను జోడించి వైవిధ్యమైన ప్రాజెక్టులకు రూపకల్పన చేశారు. విజయవాడలోని ఎస్ఎస్ కన్వెన్షన్ వేదికగా నిర్వహించిన పాలిటెక్ ఫెస్ట్‌లో వీటిని ప్రదర్శించారు. రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ డైరెక్టర్ గణేష్‌కుమార్ సోమవారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన ఈ ఫెస్ట్‌లో.. రాష్ట్రంలోని 107 పాలిటెక్నిక్‌ల నుంచి 249 ప్రాజెక్టులను ప్రదర్శించారు. వీటిని వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన విద్యార్థులు తిలకిస్తున్నారు. మూడు రోజుల పాటు ఈ ప్రదర్శన కొనసాగనుంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ